భారత

ఋషిపీఠం

భారతీయ మానస పత్రిక



బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారి
సంపాదకత్వంలో

సంపుటి: 10 ✦ సంచిక: 01 ✦ 76 పేజీలు ఫిబ్రవరి-2023 ✦ వెల: రూ.35/-

✦ చందోలు మహర్షి - అసలు చరిత్ర



చందాను చెల్లించడానికి ప్రక్కన ఉన్న క్యూఆర్ కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి

మహాశివరాత్రి ప్రత్యేకం

విషయసూచిక

ప్రత్యేక రచనలు

ధారావాహికలు

శీర్షికలు

ఋషిపీఠం చారిటబుల్ ట్రస్ట్

చందోలు మహర్షి- అసలు చరిత్ర

- డా॥ కొప్పరపు నారాయణమూర్తి

"ఆంధ్రదేశమున శ్రీ శాస్త్రిగారి నెఱుంగని వారెవరు? ఈ చందోలు శాస్త్రిగారు (బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి గారి అభిజనము తెనాలికి సమీప మందలి చందోలు - ఒకప్పుడు చంద్రపురి) గృహస్థాశ్రమమందున్న శంకరులు - **'దర్శనాదేవ సాధవః'** అను నానుడికి వారే తార్కాణము. వారు నిస్పృహులు, కవులు. వారి దర్శనం భాగ్యవిశేషము. వారి తండ్రిగారు బ్రహ్మశ్రీ వేంకటప్పయ్యశాస్త్రిగారు ఆంధ్రదేశమున 'నహిప్రతి'గా పేరొందిన కవివల్లజులు" అని వర్ణించారు బ్రహ్మశ్రీ బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారు.

బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారు తెనాలి సాధన గ్రంథమండలి వ్యవస్థాపకులు. అంతేగాదు... కంచి



పరమాచార్య శ్రీ చన్ద్రశేఖరేన్ద్రసరస్వతి మహాస్వామివారికి అత్యంత సన్నిహితులు. వారి అనుగ్రహం, ఆశీస్సులు మెండుగా కలవారు. వారు తెనాలి వచ్చినప్పుడల్లా వీరింట్లోనే విడిది చేసేవారు. ఈ మహాస్వామిలాగానే శృంగేరి పీఠాధిపతివారు కూడా తెనాలి వచ్చినప్పుడు బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారి ఆతిథ్యమే స్వీకరించేవారు. ఇటువంటి నేపథ్యమున్న బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారు శ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి గారికి కూడ ఆప్తులు అవడమేగాక, కంచి పరమాచార్య అనుమతి, ఆదేశములతో శ్రీ శంకర భగవత్పాదులు రచించిన అన్ని స్తోత్రములకు శ్రీ చందోలు శాస్త్రిగారితోనే వ్యాఖ్యానము, అనువాదము చేయించి వాటిని అనేక సంపుటములలో వరుసగా ప్రచురించారు.

శ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారినే చందోలు శాస్త్రిగారు అంటారు. కారణం చందోలు వారి ఊరు కావడమే. ఇది బాపట్ల - గుంటూరు బస్సు మార్గంలో ఉంటుంది. చందోలు శాస్త్రిగారిని 'మహర్షి' అని కూడా అంటారు. వీరి తండ్రిగారు శ్రీ తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రిగారు కూడా ఋషితుల్యులు, మహాకవి. తిరుపతి వేంకటకవులకు, కొప్పరపు కవులకు, బెల్లంకొండ రామరాయకవి వంటి కవులకు సమకాలికులు. తిరుపతి వేంకటకవులకు, బెల్లంకొండ రామరాయకవితో వివాదంలో ఆనాడు ప్రధాన పాత్ర పోషించారు.

శ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారి చిన్ననాటి వివరాలు చరిత్రలో నిక్షిప్తం కాలేదు. ఆయన ఆగస్టు 25, 1896 వేంకటప్పయ్య, హనుమాయమ్మలకు జన్మించినట్టు మాత్రమే వారిపై అందుబాటులో ఉన్న సాహిత్యం నుండి తెలుస్తోంది. వారి తల్లిగారి వివరాలు, ఆవిడ గారి స్వస్థలం, వంశం, గోత్రం, వారివైపు వారెవరో కూడా తెలియదు. కేవలం తండ్రిగారు అయిన వేంకటప్పయ్యశాస్త్రిగారి వివరాలు మాత్రమే జీవిత చరిత్ర పుటలు తెలుపుతున్నాయి. అంతటి గొప్ప యోగపురుషుని జనన వివరాలు తెలియకపోవడం నిజంగా ఒక చారిత్రక లోపమే. వేంకటప్పయ్యశాస్త్రిగారు ఆత్రేయస గోత్రీకులు అని మాత్రం తెలుస్తోంది. 'తాడేపల్లి' ఇంటి పేరు గలవారు అంతా ఆత్రేయస గోత్రీకులు కాదు. తెనాలిలో ఇతరత్రా ఈ ఇంటి పేరుతో ఉండే అనేక కుటుంబీకులకు శ్రీ చందోలు శాస్త్రిగారితో ఎటువంటి చుట్టరికమూ లేదు.

తొలుత శ్రీ రాఘవనారాయణశాస్త్రిగారి యోగ జీవితమును గ్రంథస్థం(శుద్ధ గ్రాంథికము) చేసినవారు వారి దౌహిత్రులు చెఱువు సత్యనారాయణశాస్త్రిగారు. అందులో భాగమైన ఒక కథను దశాబ్దాల క్రితం శ్రీ రాఘవనారాయణశాస్త్రిగారి శిష్యులలో ఒకరైన గట్టి లక్ష్మీనరసింహశాస్త్రిగారు 'అగ్నిపరీక్ష' పేరుతో తెలుగులో

గద్యకావ్యంగా వ్రాశారు. ఈ కథను సంస్కృతం(తెలుగు లిపి)లో 'శ్రీ గురుచరిత – మహాకావ్యం'గా శ్రీ మేళ్ళ చెరువు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారు 1991లో ముద్రించారు. దీనినే తెలుగులో 'పితాపుత్ర కవీశ్వరులు – చందోలు మహర్షులు'గా కూడా వ్రాశారు శ్రీ మేళ్ళచెరువు వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు. తొలుత దీనిని బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారి కుమారుడు హరిశంకర శర్మ సాధన గ్రంథమండలి నుండి 1996(మూడవ ముద్రణ 2018)లో వెలుగులోకి తెచ్చారు.

ఈ 'పితాపుత్ర కవీశ్వరులు – చందోలు మహర్షులు'లో శ్రీ చందోలుశాస్త్రిగారి బాల్యంలోని మంత్రోపదేశ ఘట్టం నుండి ఆయన యోగసాధన, ఆత్మసాక్షాత్కారం, ఈ సాధనలో ఎదురైన అనుభవాలు వరకూ ప్రధానంగా కనిపిస్తాయి. శ్రీ శాస్త్రిగారి సాధన, ఎదురైన అనుభవాలు ఆయన నుండే వెలువడిన మాటల ఆధారంగా ఈ పుస్తక రచన సాగిందన్నది మేళ్ళచెరువు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారి రచన ద్వారా విదితం అవుతుంది. మన ప్రవచనకారులు తమ ప్రవచనాలలో శ్రీ చందోలుశాస్త్రిగారి గురించి చెప్పే విషయాలు ఎక్కువ భాగం ఈ పుస్తకం నుండి తెలిపేవే అన్నది ఈ పుస్తకం చదివిన వారికి తేటతెల్లం అవుతుంది. కంచిపరమాచార్య శ్రీ చన్ద్రశేఖరేన్ద్రసరస్వతి మహాస్వామివారు, శ్రీ శృంగేరి పీఠాధిపతులు శ్రీ చందోలు శాస్త్రిగారిని దర్శించి, ఆయనకు తమ ఆశీస్సులు అందించడానికి స్వయంగా చందోలు వచ్చినది మాత్రం చారిత్రక సత్యం. ఇందుకు బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారితో సహా అనేక మంది నాటి మహామహులు ప్రత్యక్ష సాక్షులు.

మేళ్ళచెరువు వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారి 'శ్రీ గురుచరిత – మహాకావ్యం' అటు కావ్యప్రమాణాలకు ధీటుగా, ఇటు శ్రీ చందోలుశాస్త్రిగారి యోగసాధనా ప్రకరణకు తగ్గకుండా చాలా అద్భుతంగా ఉంటుంది. సంస్కృతంలో ప్రవేశం ఉన్నవారు దీనినే చదివి తరించవచ్చు. మేళ్ళచెరువు వేంకటసుబ్రహ్మణ్య శాస్త్రిగారు వ్రాసిన రెండు జీవిత చరిత్రలలోనూ శ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారి జీవితం ఒక క్రమ పద్ధతిలో, సంప్రదాయ జీవిత చరిత్రలలోలాగా ఆవిష్కారం కాదు. ఉదాహరణకు శ్రీ చందోలు శాస్త్రిగారి తల్లి పేరు, చందోలుశాస్త్రిగారి జననం, బాల్యం, విద్యాభ్యాసం వంటివి ఏవీ చరిత్ర క్రమంలోనూ కనిపించవు. శ్రీ చందోలు శాస్త్రిగారు సన్యసించాలనుకుని తల్లి అనుమతి కోరిన ఒకే ఒక ప్రస్తావన సందర్భంగా తల్లిపేరు ప్రస్తావన చేస్తారు రచయిత. అంతేకాదు చందోలుశాస్త్రిగారి యోగశక్తిని దర్శించిన, అనుభవించిన వారి పేర్లు, వివరాలు ఏవీ ఉండవు. కేవలం ఒక లీలగా, రేఖామాత్రంగా వాటిని పేర్కొనడం ఉంటుంది. ఇది ప్రామాణిక జీవిత చరిత్రలకు భిన్నమైన పద్ధతి. ఇక తెలుగు వికీపీడియాలో శ్రీ చందోలు శాస్త్రిగారి జీవిత చరిత్ర అంతా తప్పులుతడకలుగా ఉంటుంది. ఈ వికీపీడియా కథనాన్ని 'అచ్యుతన్' అనే వెబ్‌సైట్ కథనం ద్వారా సేకరించారని తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో వీరి జీవితమును ఒక సంప్రదాయబద్ధమైన జీవితక్రమంలో రాయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

శ్రీ రాఘవ నారాయణశాస్త్రిగారు తన పూర్వజన్మ వృత్తాంతము తెలియగోరి సమాధిలోకి వెళ్ళారు. చిన్నమ్మ సాక్షాత్కరించి "నీవెవరో చెప్తా రా..." అంటూ చందోలుశాస్త్రివారి చేయి పట్టుకొని బయల్దేరింది. స్థూలకాయుడైన శ్రీ చందోలు శాస్త్రిగారి నుండి ఒక దివ్య శరీరం, చిన్నమ్మ రూపంలో ఉన్న బాలా దివ్యశరీరం - రెండూ ఊర్ధ్వలోక ప్రయాణం అయ్యాయి. అనేక లోకాలను దాటి ముందుకు పయనించి చివరకు అవి శ్రీ చక్రవ్యూహంలోకి ప్రవేశించాయి. ఆ త్రికోణాత్మక చక్రంలో మూడు ఆవరణలు దాటి నాలుగవ ఆవరణకు వచ్చాయి. అప్పుడు చిన్నమ్మ చెప్పింది. "అబ్బాయీ! నీవు ఇక్కడివాడవు" అని.

బాల్యము-విద్యాభ్యాసము

శ్రీ చందోలు శాస్త్రిగారు బాల్యంలో అందరిపిల్లల్లా ఆటపాటలలో గడపలేదు. బాల్యం నుండే తల్లిదండ్రులు వీరిని వేదహిత కర్మలకు అలవాటు చేశారు. అక్షరాభ్యాసం మొదలు పదేళ్ళు వచ్చేవరకూ వారి తండ్రి వేంకటప్పయ్యశాస్త్రిగారి వద్దనే సంస్కృత విద్యను అభ్యసించారు. బ్రాహ్మీముహూర్తంలో లేవడం నుండి అనుష్ఠాన కర్మలు, యజ్ఞ హోమక్రతువులలో తల్లిదండ్రుల వెంటనే ఉండి అన్నిటా భాగస్వామ్యులు అయినారు. పాఠశాల విద్యలకు పోలేదు. ఆ ప్రకారంగా వారికి ఆంగ్లభాషతో సంకరం అయ్యే అవకాశం కలుగలేదు. ఈ క్రమంలో ఆయన బాల్యంలోనే ఒక తపస్విలా కనిపించేవారు. మెడలో రుద్రాక్ష మాలికలు, నుదుట భస్మత్రిపుండ్రరేఖలు ధరించి అగ్నికార్యం నిర్వర్తించేవారు. లోకం దృష్టిలో వారు ఒక బాల బైరాగి. వారికి ఓనమాలు నేర్పిన మాచిరాజు దండయ్య పంతులు గారి

అల్లుడు(కేదారలింగం) ఒక గొప్ప మంత్రవేత్త, తాడికొండ నివాసి, గొప్ప ఉపాసకుడు. శ్రీ చందోలు శాస్త్రిగారికి పన్నెండవ ఏట 'బాలామంత్రోపదేశం' చేశారు. అప్పటి నుండి చందోలుశాస్త్రిగారు ఈ మంత్రాన్ని తన పదహారవ ఏట వరకూ పూర్ణ బ్రహ్మచర్యంతో జపిస్తూండేవారు. బ్రహ్మచర్య వ్రతం అంటే వివాహం లేకుండా ఉండడమని చాలా మంది అనుకుంటారు. ఎందుకంటే ఆ రోజులలో బాల్య వివాహాలు ఉండేవి సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబాలలో. కాని, ఇక్కడ విషయం ఏమిటంటే శ్రీ చందోలు శాస్త్రిగారు అద్దము, దువ్వెన, తలకు నూనె వాడేవారు కాదు. కేశాలంకరణవంటివి చేయలేదు. తాంబూలాన్ని ముట్టుకునేవారు కాదు. స్నానం, జపం, అగ్నికార్యం, నేలపై పడుకోవడం, రాత్రిమాత్రమే నిద్రించడం చేస్తూ మంత్రాన్ని జపించడం వలన ఆయనకు మంత్రసిద్ధి జరిగింది. ఫలితంగా వారి వాక్కుకు మహిమ ఏర్పడింది. వారి వాక్కుతో ఏమి అంటే అది జరిగేది. ఈ క్రమంలోనే సాక్షాత్కరించిన 'బాలాత్రిపుర సుందరి' – తను 'పినతల్లి' అని పిలిచే మాచిరాజు శేషమ్మను పోలి ఉండడంతో బాలాత్రిపుర సుందరిని పిన్నమ్మ అని పిలిచేవారు. నిజానికి ఈ మాచిరాజు శేషమ్మ చందోలు శాస్త్రిగారికి పినతల్లి 'బాలాత్రిపుర సుందరి' అవునా, లేక పరిచయస్థురాలా అన్న విషయంలో స్పష్టత లేదు.

సన్న్యాసం-వివాహం

'బాలా' సాక్షాత్కారము తర్వాత చందోలుశాస్త్రిగారు మానసికంగా సంపూర్ణ వైరాగ్యస్థితి పొందారు. సాక్షాత్తు జగన్మాత దర్శనమైన తర్వాత వారికి ఈ ప్రపంచంలో ఏదీ అవసరమని అనిపించలేదు. తనకు ఏది కావాలో అది 'అమ్మే' ఇస్తుందన్న భావనలో ఉండేవారు. ఆఖరికి తనకు శారీరక అనారోగ్యం కలిగినా, ఆర్థిక అవసరం ఉన్నా... అన్నీ ఆ 'బాలా'నే చూసుకుంటుందన్నంత నమ్మకం ఏర్పడింది. ఆయనలోని ఆ నమ్మకాన్ని ఏనాడు వమ్ము చేయక ఆయనతోనే చివరి క్షణం వరకు ఉండిపోయింది 'బాలాత్రిపురసుందరి'. ఈ క్రమంలోనే ఆయన ఇక సన్న్యసించాలనుకున్నారు. తన కోర్కెను తల్లి హనుమాయమ్మకు తెలిపారు. ఆమె ఈ విషయం వేంకటప్పయ్య శాస్త్రిగారికి చేర్చింది. వారివురు శ్రీ చందోలు శాస్త్రిగారి సన్న్యసించాలన్న కోరికను సరిగా అర్థం చేసుకోలేదు. అదంతా ఏదో అమ్మ అనుగ్రహించడం వలన కలిగిన ఆవేశంగానే భావించారు కానీ, ఒకనాడు శాస్త్రిగారి తండ్రి వేంకటప్పయ్య శాస్త్రిగారు కొన్ని పనులపై ఊరి బయటకు వెళ్ళారు. త్రోవలో అక్కడి తాటిచెట్ల నడుమ, ముళ్ళపొదల మధ్య తపస్సులో కూర్చున్న కొడుకును చూసి ఆశ్చర్యపోయారు. చందోలు శాస్త్రిగారికి పరిసరాల స్పృహ లేదు. సమాధి స్థితిలో ఉన్నారు. అప్పుడు అర్థమయింది వేంకటప్పయ్య శాస్త్రిగారికి తన కుమారుని మనోగతం.

తన కుమారుడు సామాన్య జీవుడు కాదని, అతని వృత్తాంతం తెలుసుకోవాలని గుంటూరులో ఉన్న గోవిందరాజుల శ్యామలాంబ అనే దివ్యజ్ఞాన యోగిని వద్దకు వెళ్లారు. ఆమె ధ్యానంలో శ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి పూర్వ జన్మమును దర్శించి, ఎవరో మహాపురుషుడు నీ పుత్రునిగా జన్మించాడని తేల్చి చెప్పింది. ఈ విషయం ఆయన తన కుటుంబీకులకు తెలియపర్చారు. ఇదంతా విన్న శ్రీ రాఘవ నారాయణశాస్త్రిగారు తన పూర్వజన్మ వృత్తాంతము తెలియగోరి సమాధిలోకి వెళ్ళారు. చిన్నమ్మ సాక్షాత్కరించి "నీవెవరో చెప్తా రా..." అంటూ చందోలుశాస్త్రివారి చేయి పట్టుకొని బయల్దేరింది. స్థూలకాయుడైన శ్రీ చందోలు శాస్త్రిగారి నుండి ఒక దివ్య శరీరం, చిన్నమ్మ రూపంలో ఉన్న బాలా దివ్యశరీరం – రెండూ ఊర్ధ్వలోక ప్రయాణం అయ్యాయి. అనేక లోకాలను దాటి ముందుకు పయనించి చివరకు అవి శ్రీ చక్రవ్యూహంలోకి ప్రవేశించాయి. ఆ త్రికోణాత్మక చక్రంలో మూడు ఆవరణలు దాటి నాలుగవ ఆవరణకు వచ్చాయి. అప్పుడు చిన్నమ్మ చెప్పింది. "అబ్బాయీ! నీవు ఇక్కడివాడవు" అని. ఆ ఆవరణంలోకి రాగానే శాస్త్రిగారి దివ్య శరీరం మాయమై ఒక సిద్ధపురుషునిగా మారి...తనకు తానే కనిపించడం జరిగింది. అక్కడ వీరికి ఎదురుగా శ్రీ చక్రేశ్వరి, శ్రీ మహారాజ్ఞి అయిన పరాభట్టారిక దర్శనమిచ్చింది.

ఆమె వీరికి కొంచెం దూరంలో ఉన్న ముగ్గురు యువతులను చూపి సిద్ధ పురుషుని రూపంలో ఉన్న శ్రీ చందోలు శాస్త్రిగారిని వెళ్ళి వారిని తన వద్దకు తీసుకురమ్మని ఆజ్ఞాపించింది. శాస్త్రిగారు వారి వద్దకు వెళ్ళి వారిని తెచ్చారు. అందులో ఒకరిని భుజంపైన ఎక్కించుకుని, మిగతా ఇద్దరిని చెరోవైపు చేతులతో పట్టుకుని తెచ్చారు. పరాభట్టారిక మహారాజ్ఞి ఒక్కసారిగా మందహాసం చేసి, "ఓరీ! నీ మనస్సు చలించినది. నీవు భూలోకంలో జన్మించు. నీ భుజంపైన వచ్చిన సుందరి నీకు భార్య అవుతుంది" అని చెప్పి అదృశ్యమైంది.

అంతే భూమి మీద సమాధి స్థితిలో నున్న శ్రీ చందోలు శాస్త్రిగారికి తన పూర్వజన్మం అవగతమైంది. ఈ క్రమంలోనే తండ్రిగారి ఆజ్ఞవలననో, లేక తను సమాధిస్థితిలో దర్శించిన స్త్రీ వృత్తాంతము కారణంగానో శాస్త్రిగారు వివాహానికి సిద్ధమైనారు. వారు తన పందొమ్మిదవ ఏట దేవమ్మగారిని వివాహం చేసుకున్నారు. అఖండ శ్రీదేవి ఉపాసకులైన అద్దేపల్లి సోమనాథశాస్త్రిగారి అన్న కూతురు ఈ దేవమ్మగారు. అద్దేపల్లి సోమనాథ శాస్త్రిగారు తాడేపల్లి వేంకటప్పయ్య శాస్త్రిగారికి గురువు.

(వచ్చే నెల: వాగ్దేవి ఎవరి భార్య?)